ADMISSIONS ARE IN PROGRESS 2024-25
Secretary & Correspondent
Bikki Venkateshwarlu
M.Sc (Physicis), M.Ed.
Join your kids with us & Empower their Academic Excellence with Ethical Foundations
INDIRA VIDYALAYA
Nursery to VII class, English Medium
Near Bodrai, Mahabubabad.
Cell: 9701912300, 9705412300

దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 43 మంగళవారం 11-02-2025 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 4 వెల : 5 రూ/..

# ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత ఇసుక సరఫరా



## - తక్కువ ధరకే ఇసుక దక్కేలా చర్యలు

## - ఇసుక రీచ్‌లపై నిఘా పెంచాలి - అధికారులను ఆదేశించిన సిఎం రేవంత్

**హైదరాబాద్,ఫిబ్రవరి 10:** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వినియోగదారులకు తక్కువ ధరకే ఇసుక లభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గనులు ఖనిజాభివృద్ధిపై సమీక్షించిన ఆయన.. అధికారులకు పలు అంశాలపై దిశానిర్దేశర చేశారు. రాష్ట్రంలో ఇసుక రవాణా, తవ్వకాల అంశంపై తెలంగాణ సీఎం రేవంత్ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టి పేదలకు ఇసుక అందుబాటులో ఉంచాలని అన్నారు. ఇసుక మాఫియాపై అధికారులు ఉక్కుపాదం మోపాలన్నారు. ఇసుక రీచ్‌ల వద్ద అధికారులు తనిఖీలు చేపట్టాలి. ఇసుక అక్రమ రవాణా చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు. ఇసుక రవాణా పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలి. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్టవేసే బాధ్యతను కలెక్టర్లు, ఎస్పీలకు బాధ్యతలు అప్పగించాలి. హైదరాబాద్‌లో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట బాధ్యతను హైడ్రాకు ఇవ్వాలి. అన్ని రీచ్‌ల వద్ద కెమెరాలు, సోలార్ లైట్లు ఏర్పాటు చేయాలి. ఇసుక స్టాక్ యార్డుల వద్ద కట్టుదిట్టమైన ఫెన్సింగ్ వేయాలి. ఇసుక బుక్ చేసిన 48 గంటల్లోపు వినియోగదారుడికి అందేలా చర్యలు తీసుకోవాలి' అని సీఎం ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతలో సొంత స్థలాలు ఉన్నవారికి ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.5లక్షల చొప్పున సాయం చేస్తున్న విషయం తెలిసిందే.

### పరీక్షలను సమర్థంగా ఎదుర్కొనేలా

# ముందుకు సాగాలి

**బంతిపై బ్యాటర్ దృష్టిలా చదువుపై శ్రద్ద పెట్టాలి**

**తల్లిదండ్రులు కూడా పిల్లలపై ఒత్తిడి పెంచరాదు**

**పరీక్షాపై చర్చా కార్యక్రమంలో ప్రధాని మోదీ**



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి10:** తల్లిదండ్రులు తమ పిల్లలను మోడల్స్‌గా ప్రదర్శించవద్దని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సూచించారు. పరీక్షలే సర్వస్వం కాదన్నారు. మనం రోబోలం కాదని, మనషులమని, ఒక దగ్గరే గిరిగీసుకొని ఉండొద్దని సూచించారు.'బయటినుంచి వచ్చే ఒత్తిడి మీద కాకుండా చదువుమీద దృష్టిపెట్టాలి. స్టేడియంలో వీక్షకులు కేకలేస్తూ, కేరింతలు కొడుతూ ఎంతగా శబ్దాలు చేస్తున్నా.. బ్యాటర్ దృష్టి మాత్రం బంతిపైనే ఉంటుంది. అలాగే విద్యార్థులు కూడా నేర్చుకోవడంపైనే దృష్టిపెట్టాలి' అని అన్నారు. కంటినిండా నిద్ర, సమతుల ఆహారం ముఖ్యమని, ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఇతర పిల్లల్లాగే ఉండేలా చూడాలని, మీ పిల్లలు వారికి అత్యంత ఆసక్తి ఉన్న అంశాల గురించి చదివేలా చేయాలని మోదీ సూచించారు. పరీక్షా పే చర్చా కార్యక్రమంలో పిల్లలతో ముచ్చటించారు. పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకు ఏటా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'పరీక్షా పే చర్చా' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 8వ ఎడిషన్ పరీక్షా పే చర్చ వీడియోను సోమవారం ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు.

# మతతత్వ ఎజెండాతో బిజెపి పోటీ

**ఎమ్మెల్సీ నామినేషన్లలో పొన్నం విమర్శలు**

**పాల్గొన్న మంత్రులు ఉత్తమ్, శ్రీధర్ బాబు**



**కరీంనగర్,ఫిబ్రవరి10:** ప్రజాస్వామ్య పార్టీ అయిన కాంగ్రెస్‌ని అర్బన్ నక్సల్స్ అని ముద్ర వేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. మతోన్మాదులు అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బీజేపీ మతతత్వ ఎజెండాతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తోందని ఆయన మండిపడ్డారు. ఎమ్మెల్సీ ఎన్నికలో బీజేపీ కి తగిన గుణపాఠం చెప్పాలని అభ్యర్థిస్తున్నానని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని భారీ మెజారిటీ తో గెలిపించాలని కోరుతున్నాని ఆయన వ్యాఖ్యానించారు. అనంతరంర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతిష్టాత్మకమైన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ను గెలిపించాలని, గ్రాడ్యుయేట్లకు కాంగ్రెస్ ఎంతో మేలు చేసిందన్నారు. నాలుగు జిల్లాలో పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేస్తామని, నాటి ప్రభుత్వాన్ని జీవన్ రెడ్డి గడగడలాడించారన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి నామినేషన్ ర్యాలీలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కొండా సురేఖ, జిల్లా ఎమ్మెల్యేలు.. ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు షబ్బీర్ అలీ, జీవన్ రెడ్డి పాల్గొన్నారు.

# కుంభమేళాకు హాజరైన రాష్ట్రపతి ముర్ము



**ఘనంగా స్వాగతించిన సిఎం యోగి, గవర్నర్ ఆనందీబెన్**

**త్రివేణి సంగమంలో పుణ్యస్నానం ఆచరించిన ద్రౌపది**

**ప్రయాగరాజ్,ఫిబ్రవరి10:** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళా లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొన్నారు. సోమవారం ఉదయం ఢిల్లీ నుంచి బయల్దేరిన ముర్ము.. 10 గంటలకు ప్రయాగ్‌రాజ్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతికి యూపీ గవర్నర్ ఆనందీ బెన్ పటేల్, సీఎం యోగి ఆదిత్యనాథ్ సహా అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి మహాకుంభమేళా ప్రాంతానికి చేరుకున్నారు. త్రివేణీ సంగమ ప్రాంతంలో పడవలో విహరించారు. ఈ సందర్భంగా సంగమం వద్ద వలస పక్షులకు ఆహారం అందించారు. అనంతరం గంగా, యమునా, సర్వసతీ నదులు కలిసే త్రివేణీ సంగమంలో పుణ్యస్నానం ఆచరించి గంగమ్మకు ప్రార్థనలు చేశారు. రాష్ట్రపతి ప్రయాగ్‌రాజ్‌లో ఎనిమిది గంటలకు పైగా ఉండనున్నారు. బడే హనుమాన్ ఆలయం, పవిత్రమైన అక్షయవత్ వృక్షాన్ని సందర్శిస్తారు. అదేవిధంగా కుంభమేళా ప్రదేశంలో ఏర్పాటు చేసిన డిజిటల్ కుంభ్ అనుభవ్ సెంటర్‌ను పరిశీలిస్తారు. సాయంత్రం 5.45 గంటలకు ప్రయాగ్‌రాజ్ నుంచి న్యూఢిల్లీకి బయల్దేరుతారు. ఈ నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేశారు. జనవరి 13న పుష్య పౌర్ణమి సందర్భంగా మహాకుంభ్ మేళా ప్రారంభమైన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 26న మహాశివరాత్రి పర్వదినం వరకు ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం కొనసాగుతుంది. ఇప్పటివరకూ 42 కోట్ల మందికి పైగా భక్తులు గంగానదిలో పవిత్రస్నానాలు ఆచరించారు. కాగా, ఈ నెల 5న ప్రధాని మోదీ కూడా కుంభమేళాలో పాల్గొన్నారు. త్రివేణీ సంగమంలో పుణ్యస్నానమాచరించారు. గంగానదికి హారతి ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. 90 నిమిషాల పాటు ఆయన మహాకుంభమేళాలో గడిపారు.

# పర్యాటక అభివృద్ధి ప్రాంతాలను గుర్తించండి

## నూతన టూరిజం పాలసీలో పొందు పర్చండి

### అధికారులకు సిఎస్ శాంతికుమారి ఆదేశం



**హైదరాబాద్,ఫిబ్రవరి10:** పర్యాటక రంగం అభివృద్ధికి సంబంధించిన ప్రదేశాలను, వారసత్వ కట్టడాలను, గుర్తించి ప్రభుత్వం చేపట్టనున్న నూతన టూరిజం పాలసీలో పొందు పరుచాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎకో, టెంపుల్, హెల్త్ టూరిజం ప్రాజెక్టులను అభివృద్ధి చేసి తద్వారా పర్యాటకుల సంఖ్యను భారీ ఎత్తున ఆకర్షించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆమె అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న నూతన టూరిజం పాలసీ -2025 పై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధ్యక్షతన డా.బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో సోమవారంఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యంగా హైదరాబాద్ నగరంలోని పలు చారిత్రక కట్టడాల సందర్శనకు వచ్చే పర్యాటకుల కోసం ట్యాంక్ బండ్, నెక్లెస్ రోడ్డు పరిసర ప్రాంతాలలో సందర్శించేందుకు స్కై వాక్ లాంటి ప్రాజెక్టును చేపట్టాలని సి.ఎస్ అధికారులకు సూచించారు. తర రాష్ట్రాలలో అమలులో ఉన్న వివిధ టూరిజం పాలసీలను అధ్యయనం చేసి తెలంగాణ రాష్ట్రానికి సరిపడ నూతన టూరిజం పాలసీ-2025 ను యువజన, పర్యాటక శాఖ అధికారులు సిద్ధం చేశారు. నూతన పాలసీపై సి.ఎస్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.శ్రీనివాసరాజు, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పరిశ్రమలు, ఐటీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, పీసీసీఎఫ్ ఆర్.ఎం.డోబ్రియాల్, ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శులు ఎస్.సంగీత, చంద్రశేఖర్‌రెడ్డి, ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ప్రకాష్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### తెలంగాణలో ఏడాదిగా


# కౌరవ పాలన

**అధికారంలోకి వచ్చాక రైతులు సహా అందరికీ మోసం**

**రైతలు భూములు గుంజుకోవడమే రేవంత్‌కు తెలుసు**

**బిఆర్ఎస్ రైతు నిరసన సభలో కెటిఆర్ విమర్శలు**

**నారాయణపేట,ఫిబ్రవరి10:** తెలంగాణలో ఏడాదిగా కౌరవ పాలన నడుస్తోందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. కొడంగల్‌లో కురుక్షేత్రం మాదిరిగా యుద్ధం నడుస్తోందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతులు, మహిళలు, వృద్ధులు, యువతకు చేసిందేమీ లేదని ఆరోపించారు. కొడంగల్‌లో భారాస రైతు నిరసన దీక్ష సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. రేవంత్ రెడ్డి ప్రజల కోసం పనిచేయడం లేదు. అనుముల అన్నదమ్ములు, అదానీల కోసమే పనిచేస్తున్నారు. రూ.కోట్లు దోచిపెట్టేందుకే పనిచేస్తున్నారు. మా ఎమ్మెల్యే సీఎం అయితే మాకు మంచి చేస్తారని కొడంగల్ ప్రజలు ఆశించారు. కానీ, రేవంత్ ప్రజల కోసం పనిచేయడం లేదు. భూములు గుంజుకోవాలనేదే ఆలోచనని అన్నారు.. రైతు బంధు డబ్బులు ఎవరికైనా వచ్చాయా?' అని ప్రశ్నించారు. నారాయణ పేట జిల్లా కోస్గిలో జరిగిన ఒక కార్యక్రమంలో తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మాజీ మంత్రి కేటీఆర్ రైతుల సంక్షేమంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 25 శాతం రైతులకు రుణమాఫీ ఇంకా జరగలేదని తెలిపారు. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ, రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించారు. మా హయాంలో 73 వేల కోట్ల రూపాయలను 12 సార్లు రైతుల ఖాతాలకు రైతుబంధు పథకానికి అందించామన్నారు. ఇది రైతుల సంక్షేమానికి మా ప్రభుత్వం చేసిన కృషి అని తెలిపారు. కానీ ప్రస్తుతం రైతులకు ఈ ప్రభుత్వం ఒక్కొక్కరికి 17,500 రూపాయలు బాకీ ఉందని, ఈ మొత్తాన్ని త్వరలోనే చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని కేటీఆర్ వ్యాఖ్యానించారు. కొడంగల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి గెలుపు ఖాయమని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఆయన విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఇక్కడి కంది రైతుల ధాన్యం కొనుగోలు చేయలేకపోవడం, బాధాకరమని ఆయన అన్నారు. ఏ ఒక్క గ్రామంలోనైనా పూర్తి స్థాయిలో రుణమాఫీ జరిగితే, తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ క్రమంలో రేవంత్ రెడ్డి రాజకీయాలపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఎక్కడ రైతులకు, పార్టీ కార్యకర్తలకు నష్టం కలిగినా మేము రక్షణగా ఉంటామని కేటీఆర్ అన్నారు.



# సుజాతనగర్ మండలంలో ఏరులై పారుతున్న మద్యం

**తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు విక్రయాలు**

**ఇంత జరుగుతున్న పట్టించుకోని ఎక్సైజ్, పోలీస్ అధికారులు**


**కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదంటున్న పేసా కమిటి**

**తొలిసమయం కొత్తగూడెం ఫిబ్రవరి 10**
ఎనీ టైమ్ మద్యం పచ్చని సంసారంలో చిచ్చు పెడుతుంది. సుజాతనగర్ మండలంలో ఎటు చూసిన బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా తయారవుతున్నాయి. దీంతో పొద్దంతా పనిచేసి సంపాదించిన సొమ్మును మద్యానికి విచ్చేస్తూ కుటుంబాలను వీధిన పడేస్తున్నారు. మండలంలోని గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వహిస్తుండడంతో యువత పెడదారి పడుతున్నారు. అనేకమంది పేరుకే కిరణా దుకాణాలు నిర్వహిస్తూ లోపల మాత్రం మద్యం వ్యాపారం చేస్తున్నారు. సొంత ఇళ్లలో పెద్ద ఫ్రిజ్ లలో పెట్టుకొని మరి విక్రయిస్తున్నారు.



**బెల్ట్ షాపులపై చర్యలు తీసుకునే తీరిక లేదా**

సుజాతనగర్ మండలంలోని 2 వైన్ షాపులు నిబంధనలు గాలికి వదిలేసి అక్రమ ధనార్జనే ధ్యేయంగా విచ్చలవిడిగా బెల్ట్ షాప్ లను ఏర్పాటు చేశారని పెసా(పంచాయతీరాజ్ ఎక్స్‌టెన్షన్ షెడ్యూల్డ్ యాక్ట్) కమిటీ మండల అధ్యక్షులు లావుడ్యా సత్యనారాయణ ఆరోపిస్తున్నారు. వైన్ షాపుల్లో ఎంఆర్పీ ధరలకు అమ్మితే వచ్చే లాభాల కన్నా బెల్ట్ షాపుల ద్వారా అధిక లాభాలు గడించే అవకాశం ఉండటంతో వైన్ షాప్ ల యజమానులు ఆటోల ద్వారా మద్యాన్ని మండలంలో ఊరూరా సరఫరా చేస్తున్నారు. తమకు కేటాయించిన గ్రామాలకు నిత్యం పేరు మోసిన బ్రాండ్లను పంపించి సొమ్ము చేసుకుంటున్నారు. కొన్ని బెల్ట్ షాపులకు వైన్ షాపుల పార్టనర్స్ లే బినామీ గా ఉండి నయా దందాకు తెరలేపినట్టు తెలుస్తుంది. మద్యం మత్తులో ఇళ్ల మధ్యలో గొడవలు పడుతూ అర్ధరాత్రి వరకు నానా రభస చేస్తున్నారని, గతంలో ఈ గొడవలు కొట్లాటలకు కూడ దారి తీసిందని ఆయన ఆరోపిస్తున్నారు. గ్రామంలో బెల్ట్ షాపుల ద్వారా మద్యం ఏరులై పారుతుందనీ ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. గతంలో జిల్లా కలెక్టర్ కు 5 సార్లు, జిల్లా ఎక్సైజ్ అధికారి 2 సార్లు స్వయంగా, రాష్ట్ర కమిషనర్ కు రిజిస్టర్ పోస్ట్ ద్వారా 2 సార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకున్న పాపాన పోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిబంధనలు పాటించని నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



# ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను నాణ్యతతో నిర్మించాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య**



**తొలి సమయం హనుమకొండ జిల్లా ప్రత్యేక ప్రతినిధి ఫిబ్రవరి 10:**
ఇందిరమ్మ మోడల్ హౌస్ ను నిబంధనల మేరకు నాణ్యతతో నిర్మాణం పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య అన్నారు.సోమవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌజ్ ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ మోడల్ హౌస్ ఎంత విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు, సెట్ బ్యాక్ ఎంత పెట్టారు, మెటీరియల్ ఏమి వాడుతున్నారు, క్యూరింగ్ ఏవిధంగా చేస్తున్నారు, ఏ బ్రిక్స్ వాడుతున్నారు, తదితర వివరాలను హౌసింగ్ అధికారి రాజేందర్ ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి ఉపయోగపడే సిమెంట్ ఇటుకల తయారీని మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం అందించే నిధులతో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు ఏ విధంగా ఉంటుందో మోడల్ హౌస్ ఉండేలా నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా తహసిల్దార్ సదానందం, ఎంపీడీవో అనిల్ కుమార్, ఎంఈఓ రాంధన్, ఇతర అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా ధర్మసాగర్ మండల కేంద్రంలోని బీసీ సంక్షేమ హాస్టల్, సాంఘిక సంక్షేమ హాస్టల్, దేవాదుల క్వార్టర్స్ నిరుపయోగంగా ఉండడంతో వాటిని అధికారులతో కలిసి సోమవారం కలెక్టర్ పరిశీలించారు. హాస్టల్స్, దేవాదుల క్వార్టర్స్ నిరుపయోగంగా ఉండడానికి గల కారణాలను సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇక్కడి నుంచి హనుమకొండకు హాస్టల్స్ ను మార్చిన విషయాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వీటి విషయమై కలెక్టర్ స్పందిస్తూ సంబంధిత శాఖల అధికారులు అందించే నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. హాస్టల్స్ ను తిరిగి తీసుకువచ్చే విషయమై పరిశీలన చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామ్ రెడ్డి, ఎస్సీ సంక్షేమ శాఖ ఈడీ బాలరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## “సమ్మక్క తల్లి కళ్యాణానికి” పలు చారిత్రక

# పుణ్య క్షేత్రాలనుండి సామాగ్రి


**- కుంభ మేళా నుండి రచ్చ కోట మహారాజ్ పంద్రం జాలిష్ రావు జంగు బాయ్ ఉపా సకుల**

**ఆధ్వర్యంలో రవి ప్రసాద్ స్వామి, ప్రసాద్ స్వామి సులోచన మాతలు గంగాజలం మట్టి విభూతి**

**- కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణాదేవి ఆశీస్సులతో విభూతి గంధం కుంకుమలు తెచ్చారు.**

**- చిరుమళ్ల పరిసరాల గుళ్ళు వారసత్వ ఇలవేల్పుల నుండి కళ్యాణ సామాగ్రిని గద్దెల వద్దకు చేర్చడం లో ప్రత్యేక శ్రద్ధ చూపిన కోయ పుణ్యం ధర్మప్రచారక్ చుంచు రామకృష్ణ**





**తొలి సమయం హైదరాబాద్ డెస్క్ 10:**
చిరుమల్ల పుట్టు గద్దెల వద్ద నిర్వహించే సమ్మక్క పగిడిద్దరాజు కళ్యాణానికి పలు చారిత్రిక పుణ్యక్షేత్రాల నుండి చిరుమల్ల చేరిన సామగ్రిని చందా వంశస్థులకు కోయ పున్నెం ధర్మ ప్రచారక్ చుంచు రామకృష్ణ అందచేశారు.అదేవిధంగా చిరుమళ్ళ పరిసర ఆదివాసి వేల్పుల గుళ్ల నుండి కూడా సమ్మక్క కళ్యాణానికి కావలసిన సంప్రదాయ సామాగ్రిని దేవతల ఆశీస్సులను తీసుకున్నారు. చిరుమళ్ళ సమ్మక్క కళ్యాణానికి బుజ్జాయిగూడెం సమ్మక్క తల్లి నుండి చీరె, పాల్వంచ పెద్దమ్మ తల్లి నుండి పువ్వులు గాజులతో పాటు,శివాల య ధ్వజస్తంభం ప్రతిష్టాపన సందర్భంగా పరమ శివుడి ఆశీస్సులు తీసుకొని, శివ పార్వతుల కళ్యాణం అక్షింతలు , తోగూడెం సమ్మక్క తల్లి నుండి పసుపు కుంకుమలు, గాజులు, బంగారం తెచ్చారు. అదేవిధంగా గొట్టెల శివాలయం శ్రీ సోమలింగేశ్వర స్వామినుండి సమ్మక్క కళ్యాణానికి ఆహ్వానం తో పాటుగా గంగా జలం కోసం పూజారి పాయం సోమయ్య తో ప్రత్యేక పూజలు చేసి 12 వ తారీకున వేసే కొత్త బోరు నీటిని చిరుమల్ల తీసుకువస్తామని ఆదివాసీ పూజారి తెలిపారు .కుంభ మేళా నుండి రచ్చకోట మహారాజ్ పంద్రం జాలిష్ రావు జంగు బాయ్ ఉపాసకుల ఆధ్వర్యంలో,రవి ప్రసాద్ స్వామి ,ప్రసాద్ స్వామి,సులోచన మాతలు గంగాజలం, మట్టి, విభూతి, కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణాదేవి ఆశీస్సులతో విభూతి గంధం కుంకుమలు తీసుకువచ్చి చందా వంశస్థులకు అందచేశారు. సమ్మక్క తల్లి కళ్యాణం కోసం విద్యుత్ ఉద్యోగులు అందరికంటే ముందుగా తల్లి కళ్యాణం కోసం విరాళాలు ఇవ్వడానికి ముందుకు వచ్చారని సమన్వయకర్త తెలిపారు. మొత్తంగా చిరుమళ్ళ పరిసర ఆదివాసీ వారసత్వ ఇలవేల్పులు, పెద్దమ్మ తల్లి, సమ్మక్క గద్దెలు,శివాలయాల నుండి సమ్మక్క తల్లి కళ్యాణం కోసం కళ్యాణ సామాగ్రిని ప్రత్యక్షంగా వెళ్లి తేవడంలో కోయ పుణ్యం ధర్మ ప్రచారక్, ఆదివాసీ 9తెగల సమన్వయకర్త, బండాని గోత్రం , బాలకుమారస్వామి వంశస్తులు చుంచు రామకృష్ణ ప్రత్యేక చొరువను చూపడం ప్రత్యేకతను సంతరించుకున్నది.ఈ కార్యక్రమం లో సమ్మక్క వంశీయులు చంద వీరయ్య గారు, బిక్షపతి సోలం వెంకటేశ్వర్లు గారు పాల్గొన్నారు.



# విశ్వనాథ్ రెడ్డికి నివాళులు

**-మండల పార్టీ అధ్యక్షుడు బట్టు నాయక్**

**తొలి సమయం దంతాలపల్లి ఫిబ్రవరి 10**
దంతాలపల్లి మండల కేంద్రంలో ఎల్లు విశ్వనాథ్ రెడ్డి గారు మరణించి నందున వారి పార్థివదేహానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏఎంసీ తొరూర్ వైస్ చైర్మన్ గుగులోతు బట్టు నాయక్ పూలమాలవేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని కుటుంబ సభ్యులు ఎల్లు సందీప్ రెడ్డిని ఓదాచారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ యాకన్న బాలాజీ శ్రీనివాస్ రెడ్డి వీరన్న శీను రూట్ ల సందీప్ ప్రశాంత్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

**తుంబూరు దయాకర్ రెడ్డి జన్మదినం**

**సందర్భంగా కేక్ కట్ చేసిన డిసిసిబి డైరెక్టర్**

# మేకల మల్లి బాబు యాదవ్



**తొలిసమయం, ఇల్లందు ఫిబ్రవరి 10 :**
తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ ఆఫీస్ ఇన్చార్జి, పొంగులేటి మేనల్లుడు తుంబూరు దయాకర్ రెడ్డి జన్మదినం సందర్భంగా కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అభిమానుల సమక్షంలో డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు షేక్ ఫతే మహమ్మద్ భారీ కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ పొంగులేటి శీనన్న రాష్ట్ర మంత్రివర్యులు కావడంతో దయాకర్ రెడ్డి క్యాంప్ ఆఫీసులో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు పొంగులేటి అభిమానులకు ఎల్లవేళలా అండగా ఉంటూ కార్యకర్తలను కాపాడుతూ, ఏ కష్టం వచ్చినా వెంటనే స్పందించి తగువిధంగా సహాయం చేస్తున్న వ్యక్తి, నన్ను వ్యక్తిగతంగా ప్రత్యేకంగా ఒక సోదరుని లాగా భావించి పార్టీకి వెన్నుదన్నుగా ఉంటున్న మంచి మనసు గల దయాకర్ రెడ్డి నిండు నూరేళు చల్లగా, ఆరోగ్యంగా ఉండాలని భగవంతుని కోరుకుంటున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బానోతు నరసింహ నాయక్, మేకల మల్లికార్జున్, మేకపోతుల మహేష్ శీలం పుల్లయ్య,మేకల మహేష్, పాటిబండ్ల ప్రసాదు, భూక్య నాగేంద్రబాబు దొడ్ల వెంకన్న బండి లక్ష్మీనర్సు బాదావత్ నాగరాజు, బండి ఉపేందర్, రాయల నాగ శంకర్, పగిడిపల్లి రాములు, చల్ల మల్లయ్య మామిళ్ళ చిన్న నరసయ్య, గుగులోతు రవి, పల్లపు ప్రసాద్ పాల్గొన్నారు.

## కోర్టులో న్యాయం జరగడం లేదని ఆవేదన

**అక్కడే ఆత్మహత్యకు యత్నించిన మహిళ**

**రంగారెడ్డి,ఫిబ్రవరి10:** కోర్టులో తనకు న్యాయం జరగడం లేదని ఆరోపిస్తూ రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం కోర్టు ఆవరణలో సోమవారం ఓ మహిళ డిజిల్ పోసుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. యాచారం మండలం, మంతన్‌గౌరెల్లి అనుబంధ గ్రామం కేస్లీ తండాకు చెందిన జర్కుల చంద్రియ కు 30 సంవత్సరాల క్రితం కమలాభాయితో వివాహం జరిగింది. వారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. వారి జీవనం సాఫీగానే కొనసాగుతున్న తరుణంలో గత కొన్నాళ్ళుగా ఆస్తి గొడవలు జరుగుతున్నాయి. అంతలోనే నగరంలో ఉపాధి చేసుకుంటూ ఇంటికి వచ్చి పోతుండేవాడు చంద్రియ. కొన్నాళ్ళ క్రితం అతనికి పద్మ అనే మహిళతో పరిచయం ఏర్పడి మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండానే రెండవ వివాహం చేసుకున్నాడు. దీంతో మొదటి భార్యకు, చంద్రియకు మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. మొదటి భార్య 1.30 గుంటల భూమిలో వాటా కావాలని కోర్టులో భర్తపై కేసు వేసింది. అంతకు ముందే రెండవ భార్య పద్మతో కలిసి 0.20 గుంటల భూమిని అమ్మేశాడు. మరో ఎకరా భూమిని కూడా అమ్మేందుకు చంద్రియ ప్లాన్ చేస్తున్నాడు. కోర్టులో కేసు ఉండగా భూమిని ఎలా అమ్ముకుంటారని తెలిసి న్యాయవాది కేసు నిర్వీర్యం చేస్తున్నారని మొదటి భార్య వాపోయింది. న్యాయం చేయాలని లాయర్లను బతిమాలింది. అయినా ఫలితం లేదని భావించి సోమవారం కోర్టు ముందు డిజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో పోలీసులు ఆమె నుంచి డీజిల్ బాటిల్‌ను లాగేసుకొని నివారించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ కు తరలించి ఆమెకు కౌన్సెలింగ్ యిచ్చి మరొకసారి కోర్టుకు తీసుకువచ్చారు. న్యాయం స్థానంలోనే చట్టపరంగా కొట్లాడాలని ఆమెకు సూచించారు. ఆమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామని సిఐ జగదీష్ తెలిపారు.

## పూజారి రంగరాజన్‌పై దాడి ఆమానుషం

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి10:** చిలుకూరు బాలాజీ ప్రధానార్చకుడు రంగరాజన్‌పై దాడి.. జరిగిన దాడిని కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగ రాజన్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. వారు ఉన్నతస్థాయి పదవులను త్యజించి సనాతన ధర్మ పరిరక్షణకు అంకితభావంతో సేవలు అందిస్తూ, భక్తులకు ఆధ్యాత్మిక మార్గదర్శనం చేస్తూ ఉన్నతమైన ధార్మిక విలువలను పాటిస్తున్నారని ఆయన కొనియాడారు. అటువంటి గౌరవప్రదమైన అర్చక వృత్తిలో ఉన్న వ్యక్తిపై జరిగిన ఈ అమానుష దాడి నిందనీయం, బాధాకరం, దురదృష్టకరమని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దౌర్జన్య చర్యలకు, బెదిరింపులకు, భౌతిక దాడులకు ఏ మాత్రం స్థానం లేదని ఆయన అన్నారు. ఇది కేవలం ఒక వ్యక్తిపై జరిగిన దాడి మాత్రమే కాకుండా, సనాతన ధర్మంపై జరిగిన దాడిగా భావించాలని, ఎలాంటి లాభాపేక్ష లేకుండా.. యువతకు, విద్యార్థులకు ఆధ్యాత్మిక దిశానిర్దేశర చేస్తున్న రంగరాజన్.. దేవాలయాలను, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడే విషయంలో, ఆలయాల వారసత్వ సంప్రదాయాలు ఉన్నారన్నారు.

# నర్సంపేటలో రైతుల నిరసన జ్వాలలు

**బి.ఆర్.ఎస్ నేత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పిలుపుమేరకు 179 గ్రామాల్లో రైతన్న నిరసనలు**

**నల్లబెల్లి మండల రైతుల ధర్నాలో మాజీ ఎమ్మెల్యే పెద్ది**



**తొలి సమయం నర్సంపేట ప్రతినిధి ఫిబ్రవరి 10:** వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గంలో టిఆర్ఎస్ సీనియర్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పిలుపుమేరకు సోమవారం 179 గ్రామ పంచాయితీ లో రైతన్నలు ఒక్కసారిగా నిరసన సైరా నై గళాన్ని వినిపించారు.ఈ నేపద్యంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి స్వగ్రామమైన నల్లబెల్లి మండల రైతుల ధర్నాలో పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అట్లాగే బోనస్ బోకస్ అని రుణమాఫీ కాక రైతు కు రణంగా మారిందని కాంగ్రెస్ పాలనలో రైతన్నది భరోసా లేని బతకైందని వ్యవసాయ కూలీలను బానిసలుగా కాంగ్రెస్ సర్కార్ చేస్తుందని అందుకే



ప్రభుత్వ ఆగడాలని ఎండ కట్టడానికి బిఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఏకకాలంలో 179 గ్రామాలు రైతన్నలు రోడ్డు ఎక్కారు... కర్షకులను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కారుపై వారి గళం విప్పి గర్జించిన రైతులు రైతు కూలీలు వారి రుణమాఫీ రైతు భరోసా బోనస్ రైతు కూలి సహాయం పేరుతో రైతన్నకు డొక్కా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని అందుకే రైతన్నలు రోడ్లపైకి వచ్చి రేవంత్ సర్కారుపై ముక్కుమ్మడిగా రైతులు నిరసనలు తెలుపుతున్నారని, నర్సంపేట నియోజకవర్గ వ్యాప్తంగా 20 వేల మంది రైతులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారని సర్కారు అసమర్థత పాలను నిలదీసేందుకు కదం తొక్కిన 179 పల్లె రైతులన్నారు.. మీరు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయి లేదంటే ప్రభుత్వ పాలన నుంచి దిగిపో అంటూ రైతులు ముక్తకంఠంతో ఖండిస్తున్నారని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు, క్లస్టర్ బాధ్యులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, గ్రామ పార్టీ అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేశారు.

# ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా ఇసుక క్వారీలు

**వెంకటాపురం మండలంలో ఇసుక క్వారీలకు డి ఎల్ సి నిర్వహించకుండా అనుమతులు**

**పట్టాల పేరుతో భారీ అక్రమాలకు దారి...**

**ఏజెన్సీ ప్రాంతంలో ఇసుక దలారి వ్యవస్థను నిర్మూలించాలి**

**జి ఎస్పి రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి**



**వెంకటాపురం ప్రతినిధి ( తొలి సమయం) ఫిబ్రవరి 10** ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా ఇసుక క్వారీలు నిర్వహణ జరుగుతుందని పూనెం సాయి ఆరోపించారు.వెంకటాపురం మండల కేంద్రంలో గొండ్వానా సంక్షేమ పరిషత్ సమావేశంలో ములుగు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు పూనెం ప్రతాప్ అధ్యక్షతన వహించడం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి పాల్గొని ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.పూర్తిగా ఏజెన్సీ ప్రాంతమైన, ఏటూరునాగారం ఐటీడీఏ పరిధిలోని నూగూరు వెంకటాపురం మండలంలో వివిధ ఆదివాసి గ్రామాల్లో ఇసుక క్వారీలు ఫైలు చేస్తూ డిఎల్ సి నిర్వహించకుండా ఇసుక ర్యాంపు ల కార్య నిర్వహణలు జరుపుతున్నారని ఆరోపించారు. సంబంధిత అధికారులు సైతం ఏజెన్సీ ప్రాంత చట్టాలను పాతర వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గిరిజన ఇసుక సొసైటీల పేరుతో గిరిజనులకు అన్యాయం చేస్తున్నారని, పట్టా భూముల క్వారీలకు ఎటువంటి సర్వేలు నిర్వహించకుండా అనుమతులు ఇస్తున్నారని ఇది రాజ్యాంగాన్ని కూని చేయటమేనని అన్నారు. జిల్లా అధికారులు కూడా గిరిజన ఇసుక సొసైటీ డి ఎల్‌సినిర్వహించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇది కేవలం గిరిజన అభివృద్ధి నీ అడ్డుకోవడానికి తావిస్తుందని వాపోయారు. ఇకనైనా ప్రభుత్వం ప్రభుత్వ అధికారులు నిద్ర మత్తు వదిలి వెంటనే డి ఎల్ సి నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఏటూర్ నాగారం ఐటి డి ఏ వ్యాప్తంగా పట్టా భూముల పేర్లతో అక్రమంగా ఇసుక క్వారీలకు అనుమతులు ఇస్తున్నారని,ఇప్పటి వరకు పట్టా భూముల్లో ఇసుక మేటలను తొగించి ఎంత భూమి సాగు చేశారని ప్రభుత్వాన్ని నిగ్గదీసి అడిగారు.పట్టా భూములకు ఇసుక మేటలు తొలగిపులకు అనుమతులు ఇవ్వాలంటే,మరల వ్యవసాయ అభివృద్ధికి అనుకూలంగా ఉంటేనే వాటికే అనుమతులు ఇవ్వాలని కోరారు.ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు అందవలసిన ఫలాలు గిరిజనేతరుల చేతులకు వెళు తున్నాయని,ఇసుక ర్యాంపులో బినామీ వ్యవస్థను నిర్మూలించే విధంగా జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గొండ్వానా సంక్షేమ పరిషత్ యువత నరేష్,చంటి, రవి తదితరులు ఉన్నారు.

# కేజీబీవీలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

**హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య**





**తొలి సమయం హనుమకొండ ఫిబ్రవరి 10:** కేజీబీవీ లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ముప్పారం పరిధిలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, పాఠశాల మైదానం, వంటగది, స్టోర్ రూమ్, మెడికల్ రూమ్ ను కలెక్టర్ పరిశీలించారు.

వాటి గురించిన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వివిధ తరగతుల విద్యార్థినులతో కలెక్టర్ మాట్లాడారు. పాఠశాలలో ఉన్న సదుపాయాలు, సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థినులతో సిలబస్ పూర్తయిందా, ఎలా చదువుతున్నారని కలెక్టర్ అడిగారు. కలెక్టర్ విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ పదో తరగతి వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలని, ఫలితాల్లో ఉత్తమంగా రాణించాలని ఆకాంక్షించారు. మీడియాతో కలెక్టర్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలలో రూ. 7.50 లక్షలతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టినట్లు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనుల పురోగతిని పరిశీలించినట్లు పేర్కొన్నారు. అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయని, తుది దశకు చేరుకున్న పనులను పరిశీలించినట్లు చెప్పారు. ఎంపీ ల్యాడ్స్ నుండి మంజూరైన నిధులతో విద్యుత్తు, హైమాస్ట్ లైట్లు, తదితర వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ నుండి రూ. 25 లక్షలతో అప్రోచ్ రోడ్డు మంజూరు చేసినట్లు తెలిపారు. కేజీబీవీ లోని ల్యాబ్స్, లైబ్రరీ, స్పోర్ట్స్, ఇతర మౌలిక వసతులను పరిశీలించినట్లు చెప్పారు. అదనంగా కావలసిన అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం నుండి వచ్చిన నిధులతో చేపట్టనున్నట్లు తెలిపారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని పరిశీలించినట్లు తెలిపారు. విద్యార్థినిలకు అందిస్తున్న భోజనం బాగుందని పేర్కొన్నారు. పాఠశాలలో మరిన్ని మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలను సిద్ధం చేసినట్లయితే నిధులు మంజూరు చేసి మౌలిక వసతులు, ఇతర అభివృద్ధి పనులను చేయించనున్నట్లు పేర్కొన్నారు. రెగ్యులర్ గా మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు వచ్చిన హెల్త్ కార్డులను పరిశీలించి వైద్య పరీక్షలను నిర్వహించడం తోపాటు మందులను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, పాఠశాల విద్యా కమిటీ చైర్పర్సన్ పవిత్ర, తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో అనిల్ కుమార్, ఎంఈఓ రాందన్, కేజీబీవీ ప్రత్యేక అధికారి మాధవి, కోఆర్డినేటర్ సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## మాల మహానాడు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దాసరి వెంకట్



**తొలిసమయం భద్రాద్రి కొత్తగూడెం ఫిబ్రవరి 10 :** మణుగూరు మాల మహానాడు ముఖ్య కార్యవర్గ సమావేశానికి మండలంలోని మాల మహానాడు పెద్దలు పాల్గొని మణుగూరు మండల మాల మహానాడు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారుడుగా మద్దెల భద్రయ్య, కన్వీనర్ గా వేర్పుల నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ లు దాసరి వెంకట్, వేర్పుల సురేష్, ప్రధాన కార్యదర్శిగా బూర్గుల సతీష్, కోశాధికారిగా చింతమల్ల రమేష్, ఉపాధ్యక్షులుగా బూర్గుల సంజీవరావు, సబ్బతి యేసురత్నం, ముల్క నరేష్, సహాయ కార్యదర్శులుగా వేమూరి రవి, పప్పుల ప్రసాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా తోట ప్రసాద్, చెలికాని రామకృష్ణ, ఉల్లోజు బాబురావు (బాబీ) లను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో నరేష్ మాట్లాడుతూ మాలలకు ఎటువంటి ఆపద వచ్చిన మాలలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సహించేది లేదని, తనను గౌరవించి పదవి ఇచ్చినందుకు ప్రతి ఒక్కరికి పేరు పేరునా రుణపని ఉంటానని, క్రమశిక్షణతో అందరితో మమేకమై అందరి ప్రేమ అభిమానాలు పొందుతా నని ఆయన వెల్లడించారు. అనంతరం కార్యదర్శి బూర్గుల సతీష్ మాలలు సామాజిక వర్గం గురించి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తానని అలాగే మాలల అభ్యున్నతకు తోడ్పడుతానని అన్ని గ్రామాల మాలలను ఏకం చేసి ముందుకు సాగుతామని ఆయన సూచించారు ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా కమిటీ దృష్టికి తీసుకోవచ్చు సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు ఈ సందర్భంగా అందరికీ శు భాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో దాసరి ఏసురత్నం, కందుకూరి యాకోబు, రామకృష్ణ, గొడిశాల నాగమళ్ళు తదితరులు పాల్గొన్నారు.


## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

**- మండల అధ్యక్షుడు బట్టు నాయక్**



**తొలి సమయం దంతాలపల్లి మండలం ఫిబ్రవరి 10** దంతాలపల్లి మండలంలోని పలు గ్రామాలలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేయడం జరిగినది. ఈ సందర్భంగా డోర్నకల్ శాసనసభ్యుడు ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు దంతాలపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏఎంసి తోరూర్ వైస్ చైర్మన్ బట్టు నాయక్ పంపిణీ చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆరోగ్య పరిస్థితులు బాగోలేక హాస్పిటల్ లో వైద్యం చేయించుకోలేని ఇబ్బందులు పడే వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో తోడ్పాటు అవుతుందని ఆయన అన్నారు. ప్రభుత్వం పేదలకు అండదండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు సోంపేట సురేష్ గౌడ్, దుండి వెంకటేశ్వర్లు, కోమటి మురళి, రూపుల, జటంగి లింగయ్య, వెలిశాల శంకర్, గురుమూర్తి, మల్లం శ్రీను, ఓలాద్రి వెంకట్ రెడ్డి, మల్లం బిక్షం శేఖర్ హరీష్ వెంకట్ నారాయణ మహేందర్ రెడ్డి అశోక్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## మీర్‌పేట్ మాధవి హత్య కేసులో ఒక్కరు కాదు నలుగురు?



**హైదరాబాద్:ఫిబ్రవరి 10** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మీర్‌పేట్ మాధవిని హత్య చేసింది ఒక్కరు కాదు నలుగురు అనే సంచలన విషయాలు బయటకు వస్తున్నాయి. మాధవిని తన భర్త గురు మూర్తి ఒక్కడే చంపలేదని పోలీసులు అనుమానిస్తు న్నారు. గురుమూర్తితో పాటు మరో ముగ్గురు ఉన్నారని.. అందులో ఓ మహిళ ఉన్నట్లు భావిస్తున్నారు. నిందితుడు గురుమూర్తిని 5 రోజులు కస్టడీలోకి తీసుకున్న పోలీసులు.. హత్యకు సహకరించిన వారి వివరాలను సేకరిస్తున్నారు. కుటుంబ సభ్యులతో కలసి ఓ ప్లాన్ ప్రకారం గురుమూర్తి ఆమెను హత్య చేశారని పోలీసుల దర్యాప్తులో తేలినట్టు తెలుస్తోంది. దీంతో ఈ హత్యకు సహకరించిన చెల్లెలు సుజాతను A2 గా, తల్లి సుబ్బలక్ష్మిని A3 గా, తమ్ముడు కిరణ్ A4 గా రిమాండ్ రిపోర్ట్‌లో పోలీసులు చేర్చినట్టు సమాచారం. మృతురాలి భర్త గురుమూర్తి ఈ హత్యలో A1గా ఉన్న విషయం తెలిసిందే. విచారణలో పలు కీలక విషయాలను పోలీసులు రాబట్టినట్టు తెలుస్తోంది. ప్రధాన నిందితుడిపై హత్య కు సంబంధించి సెక్షన్లు నమోదు చేయగా.. మిగిలిన ముగ్గురిపై బీఎన్ఎస్‌లోని 85 సెక్షన్ గృహహింస ప్రయోగిం చారు. ఈ ముగ్గురు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

# మోడీకి కలిసి వస్తున్న విఫల ప్రతిపక్షం !



**తొలి సమయం హైదరాబాద్,** బాధ్యతలేని ప్రతిపక్షాల కారణంగా మోడీ ప్రభుత్వానికి చెక్ పెట్టే అవకాశం లేకుండా పోతోంది. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ తన బాధ్యతను సరిగా నిర్వహిం చలేక పోతోంది. దేశం ఏమైపోతున్నా పట్టించుకోవడం లేదు. బడ్జెట్ సమావేశాల్లో బాధ్యతాయుత ప్రతిపక్షంగా సమస్యలపై చర్చిస్తారని ఆశిస్తున్న దేశ ప్రజల అడియాశలు కాక తప్పడం లేదు. రాష్ట్రపతి ప్రసంగాన్ని బహిష్కరించారు. రాష్ట్రపతిపై తల్లీకుమారులు సోనియా, రాహుల్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. వారి అహంకారానికి ఇది పరాకాష్ట అని చెప్పాలి. ఇకపోతే అనవసర సమస్యలపై మాట్లాడుతున్న కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు, దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చకు సిద్దంగా ఉండడం లేదు. ఒకప్పుడు బడ్జెట్ సమావేశాల్లో ప్రతిపక్షాలను చూస్తే అధికార పక్షం వణికి పోయేది. ఏ సమస్యను ఎక్కడ లేవదీస్తారో అన్న భయం ఉండేది. ప్రతిపాదనల్లో కోతలు విధించేవారు. సవరణలకు పట్టుబట్టేవారు. అదనపు కేటాయింపులు జరిగేలా చూసేవారు. కమ్యూనిస్టుల ప్రధానంగా ఈ పాత్ర పోషించేవారు. కానీ కమ్యూనిస్టులు లేకపోవడం, ఉన్న కాంగ్రెస్ పార్టీ అధికారానికి బాగా అలవాటై పోవడం వల్ల ప్రతిపక్ష బాధ్యతలను సరిగా నిర్వహించడం లేదు. పెళ్లిళ్ల సీజన్‌లో బంగారం వెండి ధరలు అమాంతంగా పెరుగుతున్నాయి. నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయి. ఉప్పులు, పప్పులు సామాన్యుడికి అందనంతగా పెరుగు తున్నాయి. ఈ క్రమంలో సమావేశాల్లో ఒక్కో సమస్యపై చర్చించినా సమయం సరిపోదు. కానీ కాంగ్రెస్, ఇతర విపక్ష సభ్యులు అనవసర సమస్యలను నెత్తికి ఎత్తుకుని సభా సమయాన్ని వృధా చేసుకుంటున్నాయి. అభివృద్ధి పేరుతో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ఊదర గొడుతూ కాలక్షేపం చేస్తోంది. పదేళ్ల పాటు యూపిఎ పాలన అంతా కుంభకోణాలమయంగా మారింది.

వారూ ఓటమి చెందారు. తరవాత 2014లో మరోమారు బిజెపి అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు పదేళ్లుగా మోడీ నేతృత్వంలోని బిజెపి పాలన సాగుతోంది. గత 20 ఏళ్ల కాలానికి పోలిస్తే దేశంలో అభివృద్ధి అన్నది ఎండమావిగానే గుర్తించాలి. కోట్లాదిమందిని పేదరికం నుంచి బయటపడేశానని ప్రధాని మోడీ పదేపదే చెబుతున్నారు. అయితే పెరుగుతున్న ధరలతో సామాన్యులు బతకడమెలా అన్నది ఆలోచించడం లేదు. సామాన్యుడు తనకుతానుగా బతకగలిగినప్పుడే నిజమైన అభివృద్ధికి గీటురాయిగా చూడాలి. భారత్ అద్భుతమైన ప్రగతి సాధించబోతుం దని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొనడం చూస్తే.. ఎండమావిని చూపి నీళ్లు తాగమనే మాటలు చెబుతున్నారన్నమాట. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్న మాటలన్నీ డొల్లగా చూడాల్సిందే. అప్పటికి వందేళ్ల స్వాతంత్ర్య భారతం అవుతుంది. గత పదేళ్లలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశాం అని పదేపదే చెబుతున్నారు. నిజానికి అభివృద్ది జరిగివుంటే ఈ దుస్థితి ఎందుకని ప్రశ్నించుకోవాలి. ప్రజలు తిండిగింజలను కొనుక్కునే పరిస్థితిలో లేరని చెప్పకనే చెప్పారు. పేద మధ్య తరగతి ప్రజలకు సొంతింటి కల ఎండమావిగా మారింది. పేదలు, మహిళలు, యువకులు, రైతులపై తమ ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పడమే తప్ప క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోవడం లేదు. అంతెందుకు జిఎస్టీ సడలింపులపై ఒక్కరూ మాట్లాడడం లేదు. తానో గొప్ప విజనరీ అని చెబుతున్న చంద్రబాబు కూడా దీనిపై ఎక్కడా చర్చించడం లేదు. ఎన్‌డిఎ భాగస్వామిగా ఉన్న చంద్రబాబు కేవలం పొగడ్తలకే పరిమితమయ్యారు. ఏ అంశాన్ని కదిలించడం లేదు, కదిలిస్తే తన రాష్ట్రానికి ఎక్కడ నిధులు రావో అన్న భయం ఆయనలో ఉంది. నితీశ్ కుమార్ తదితరులు కూడా ప్రేక్షకులుగా మారారు. ప్రధాన ప్రతిపక్షమే నాయకత్వ లోపంతో ఉంది. రాహుల్‌కు దేశంపైనా, సమస్యలపైనా అవగాహన లేకుండా పోవడం కూడా ఇందుకు కారణమని చెప్పుకోవాలి. నిజానికి జిఎస్టీపై తక్షణం ఈ సమావేశల్లో చర్చించాలి. దానివల్ల కలుగుతున్న దుష్పరిణామాలను చర్చించాలి. పన్నుల వల్ల ప్రజలు ఎంతగా దెబ్బతింటున్నారో చర్చించాలి. కాంగ్రెస్, ఇతర విపక్షాలు ఈ ఒక్క అంశంపై ఎన్నిరోజులైనా చర్చించేందుకు నిలబడగలగాలి. కానీ ఆ పని చేయడం లేదు. జిఎస్టీ వసూళ్లు నెలకు లక్షా 70 వేల కోట్లకు చేరడం చూసి అభివృద్ధి అనుకుంటున్నారు. కానీ అదంతా ప్రజలపై పన్నుల కొరడా అని గుర్తించడం లేదు. ప్రజలు స్వచ్ఛందంగా పన్నులు కట్టలేని దుర్భర పరిస్థితు ల్లో ఉన్నారు. రైతులకు కనీస మద్దతు ధరలు అన్నవి రావడం లేదు. కానీ బియ్యం, ఉప్పు,పప్పుల ధరలు మాత్రం ఏటికేడు ఆకాశాన్ని అంటుతున్నాయి. అన్ని వర్గాల అభివృద్దే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం అని మోసగించడం తప్ప మరోటి కాదు. దేశంలో ఎన్నో సమస్యలు పరిష్కరించడం వేరు..కానీ పేదలు, మధ్యతరగతి ప్రజలు ప్రభుత్వం అండ లేకుండానే జీవించగలగాలి. కానీ ఈ పదేళ్లలో అలాంటి అవకాశాలు లేకుండా చేశాయి.

సామాన్యులు ఇల్లు కొనుక్కునే పరిస్థితి లేదు. బ్యాంక్ వడ్డీ రేట్లు దారుణంగా ఉన్నాయి. భూములు, సిమెంట్, స్టీలు ధరలను అడ్డం పెట్టుకుని బిల్డర్లు దోపిడీ చేస్తున్నారు. మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన సంస్కరణ లు ఫలితాలిస్తాయని ఆశించారు. దేశ ప్రజలు భవిష్యత్‌పై ఆశతో ఉన్నారు. ఆదాయపు పన్ను సడలింపులు, ఆర్‌బిఐ రెపోరేటు తగ్గింపులు కేవలం పైపూతలు మాత్రమే. దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, ధరల పెరుగుదల, జిఎస్టీ వంటి అంశాలపై పార్లమెంటులో చర్చించాలి. ఇందుకు ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ కసరత్తు చేయాలి. ప్రభుత్వాన్ని నిలదీయగలగాలి. ప్రజల్లో ఇమేజ్ పొందాలంటే ఇదే సమయం. బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీయగలిగేంతగా బలం ప్రతిపక్షానికి ఉంది. దీనిని ఉపయోగించుకునే సామర్థ్యం రాహుల్‌కు ఉందా లేదా అన్నది చూడాలి. ప్రతిపక్షనేతగా ఎదగాలంటే ప్రజల సమస్యలపై చర్చించాలి. ఏదో ఒక పనికిరాని సమస్యను ముందుకు వేసుకుని ధర్నాలు, ప్లకార్డు ప్రదర్శనలు చేసినంత మాత్రాన ప్రజలు పట్టించుకోరు. ప్రధాన సమస్యలపై చర్చించేలా కాంగ్రెస్‌లో కూడా సరైన నేతలు కాని, సలహాలు కానీ ఇచ్చేవారు కరువయ్యారు. అందుకే మోడీని ఎదిరించేలా ప్రతిపక్ష బాధ్యతలను రాహుల్ నిర్వహించడం లేదు.

# సొంతింటి కలకు ప్రభుత్వాల మోకాలడ్డు

## ధరలకు తోడు అనేక రకాల పన్నుపోట్లు

**హైదరాబాద్,ఫిబ్రవరి10:** హైదరాబాద్ లాంటి నగరంలో కోటిన్నర లేనిదే ఓ అపార్ట్‌మెంట్ రావడం లేదంటే ఇది అభివృద్ధి అవుతుందా.. లేక సామాన్యులకు ఇల్లు అందుబాటులో లేకపోవడమా అన్నది ఆలోచన చేయాలి. రియల్ రంగం పూర్తిగా దెబ్బతింటోంది. ప్రజల్లో ఇల్లు కొనుక్కోవాలన్న ఆలోచన లేకుండా ప్రభుత్వా తీరు ఉంటోంది. భూముల ధరలు పెరగడం, రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచడం, ఇళ్లు అందుబాటులో లేకుండా పోవడం అన్నది అభివృద్ధికి సంకేతం కాదు. ఇది తిరోగమన చర్యగా చూడాలి. ప్రధానంగా రియల్ రంగంతో వేలాదిమంది ఉపాధి పొందుతున్నారు. వివిధ రకాల వృత్తులు దీనితో పెనవేసుకుని వున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో కాలయాపన చేస్తూ... పోయేబదులు సామాన్యులు ఇల్లు కొనుక్కునే పరిస్థితులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్చించాలి. ఇల్లు లేదా అపార్ట్‌మెంట్ కొనాలను కుంటున్న వారికి పన్నుల భారతం తడిసి మోపెడు అవుతోంది. ఇందులో జిఎస్టీ పదినుంచి 12 లక్షలు, రిజస్ట్రేషన్‌కు ఓ పది నుంచి 20 లక్షలు కట్టాలంటే ఎంత భారం పడుతుందో ప్రభుత్వాలు ఆలోచించడం లేదు. తెలంగాణలో కెసిఆర్ పుణ్యమా అని లోన్‌పైనా 50వేల అదనపు పన్నులు వేశారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాలు దోపిడీ కేంద్రాలుగా మారాయి. నిజానికి బడ్జెట్ పద్దులు ప్రజలను ఆదుకునేలా ఉండాలి. అందమైన ఎసి గదుల్లో కూర్చుని ఆలోచిస్తే ఎన్నటికీ అంటే 2047 నాటికి కూడా ప్రజల బతుకులు బాగుపడవని గుర్తించాలి. సామాజిక న్యాయం కేవలం రాజకీయ నినాదంగా మాత్రమే కనిపిస్తోంది. సామాజిక రుగ్మతగా మారిన వ్యవస్థీకృత అసమానతలను రూపుమాపుతున్నాం అన్న పదాలు వినడానికి బాగానే ఉంటాయి. గత పదేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థలో అనేక గుణాత్మక మార్పులు వచ్చాయని చంకలు గుద్దుకోవడంతో సరిపుచ్చితే మార్పు రాదు. పీఎం ఫసల్ బీమా యోజన కింద కోట్ల మంది రైతులకు పంట బీమా సాయం అందుతోందని బడ్జెట్‌లో చెప్పారు.

నిజానికి దేశంలో ఎక్కడ ఎలాంటి పంటలు పండుతు న్నాయి. వాటికి ఎంత ఖర్చవుతుంది. రైతులు ఏంకోరుకుంటున్నారన్న చర్చ చేయడం లేదు. వ్యవసాయ చట్టాలు ఎత్తేశాక వాటి గురించి చర్చించడం లేదు. పన్ను వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణల వల్ల ట్యాక్స్ చెల్లింపుదారుల సంఖ్య పెరిగింది. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం వల్ల పొదుపులు, పెట్టుబడులకు భద్రత ఏర్పడిందం టున్నారు. నిజానికి ఇదొక్కటే దేశాన్ని, ప్రజలను అగాధంలోకి నెట్టుతోందని ఎంత త్వరగా గుర్తిస్తే అంతమంచిది. ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చిందన్న మాటలు శు ద్ధ అబద్ధం. ఆర్థిక వ్యవస్థ బలోపేతమై ప్రజలకు ఉపాధి లభించేలా ప్రజా ప్రయోజనాల కోసం అనేక కార్యక్రమాలు, పథకాలు రూపొందించాల్సి ఉంది. బ్యాంకులను సంస్కరించాల్సిన అవసరం ఉంది. అన్ని ప్రాంతాల అభివృద్దే లక్ష్యంగా బడ్జెట్‌ను రూపొందించడం జరిగిందన్న విషయంలో అబద్దాలను అందంగా చెప్పారు. 2014కు ముందు దేశం అనేక సవాళ్ల ను ఎదుర్కొందన్న ప్రధాన మంత్రి.. ఇప్పుడు పరిస్థితులు చక్కబడ్డాయని చెప్పడం మోసం చేయడం తప్ప మరోటి కాదు. పేదల అభివృద్దే దేశ అభివృద్ధి. భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతో ందంటే వారు బాగుపడ్డ దాఖలాలు కనబడాలి. ఫ్రీ రేషన్‌తో ఆహార సమస్య తీరిందని పేర్కొనడంతోనే దేశం ఏ మేరకు అభివృద్ధి చెందిందో అర్థం చేసుకోవచ్చు. గ్రామీణ ప్రజల ఆర్థిక వికాసం సాధ్యం అవుతోందని చెప్పకుండా ఉంటే బాగుండేది. కోట్లాది మంది రైతులకు నేరుగా నగదు బదిలీ చేస్తున్నామంటేనే వారికి తగిన గిట్టుబాటు ధరలు, వ్యవసాయ పనిముట్లు అందడం లేదని అర్థం చేసుకోవాలి. ఇన్ని సమస్యలను చర్చించకుండా బడ్జెట్‌లో అంతా బాగుందని చెప్పడం ద్వారా భారత్ అభివృద్ధిలో దూసుకుని పోతోందని అంటే నమ్మడానికి ప్రజలు సిద్దంగా లేరని గుర్తించాలి.

# ఢిల్లీలో ఓటమికి ఆప్, కాంగ్రెస్‌లదే బాధ్యత

## ఉద్దవ్ఠాక్రే శివసేన నేత సంజయ్ రౌత్ వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి10:** దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఘోర పరాజయాన్ని మూట కట్టుకుంది. 27 ఏళ్ల తర్వాత కాషాయ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఇక సుదీర్ఘ అనుభవం కలిగిన కాంగ్రెస్ అయితే ఘోరంగా చతికిలపడింది. ముచ్చటగా మూడోసారి కాంగ్రెస్ జీరో సీట్లు సాధించింది. తాజాగా ఢిల్లీ ఎన్నికల ఫలితాలపై శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ స్పందించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి ఆప్, కాంగ్రెస్ బాధ్యత వహించాలని సూచించారు. మనమంతా ఇండియా కూటమిలో భాగస్వాములం.. కాంగ్రెస్ సీనియర్ భాగస్వామి.. అందరినీ కలుపుకుని తీసుకుని వెళ్లాల్సిన బాధ్యత కాంగ్రెస్‌కు ఉందని హితవు పలికారు. అలాగే ఆప్ కూడా బాధ్యత ఉందని చెప్పుకొచ్చారు. ఎన్నికల్లో కలిసి పోటీ చేసుంటే.. ఫలితాలు భిన్నంగా ఉండేవని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందే దీనిపై చర్చ జరగాల్సి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. ఆప్-కాంగ్రెస్ కలిసి పోటీ చేసుంటే.. బీజేపీ గెలిచేది కాదు అన్నారు. ఇప్పుడు ఓటమికి ఆప్, కాంగ్రెస్ రెండూ కూడా బాధ్యత వహించాల్సిందేనని పేర్కొన్నారు. అయినా ఇండియా కూటమిలో ఎవరికీ అహం ఉండకూడదన్నారు.

ముఖ్యంగా కాంగ్రెస్ పెద్దన్న పాత్ర పోషించాలని సంజయ్ రౌత్ హితవు పలికారు. గత శనివారం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు విడుదల య్యాయి. ఈ ఫలితాల్లో బీజేపీ అధికారం చేజిక్కించుకుంది.

# డంకీరూట్‌లో అక్రమంగా ప్రవేశం

**సాహసంతో ప్రాణాల మీదకు తెచ్చుకున్న జనం**

**తాజాగా పంజాబీ యువకుడు దుర్మరణం**

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి10:** డంకీ రూట్..అంటే దొంగమార్గమని వేరుగా చెప్పనక్కరలేదు. అగ్రరాజ్యంలో ఈ రూట్లో ప్రవేశించేందుకు యత్నించిన అనేకమంది అసవులు బాసారు. ఇందులో అనేకదేశాల వారూ ఉన్నారు. భారీతయులు కూడా ఇలా ప్రతయ్నించి ప్రాణాలు పోగట్టుకుంటున్నారు. ఈ క్రమంలోనే అక్రమంగా తమ దేశానికి వచ్చిన 104 మంది భారతీయులను ఇటీవల అమెరికా తిప్పి పంపిన సంగతి తెలిసిందే. అక్రమ వలసదారులపై ట్రంప్ మొదటినుంచి కఠినంగా ఉంటున్నారు. ఆయన పదవీ బాధ్యతలు చేపట్టడంతో వారి గుర్తింపు, తరలింపు పక్రియను వేగవంతం చేశారు. ఈక్రమంలోనే ఇటీవల 104 మంది భారతీయులను సైనిక విమానంలో వెనక్కి పంపించిన సంగతి తెలిసిందే. దీంతో అగ్రరాజ్యంలోకి అక్రమంగా వెళ్లగలిగే మార్గాలపై చర్చ మొదలైంది. ఈనేపథ్యంలోనే తాజాగా ఓ పంజాబీ యువకుడు డంకీ రూట్ లో అమెరికా వెళ్తూ మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోయిన ఘటన వెలుగు చూసింది. 33 ఏళ్ల గుర్‌ప్రీత్‌సింగ్ గ్వాటెమాలాలో గుండెపోటుకు గురై మృతి చెందాడు. ఈ విషయాన్ని మృతుడి కుటుంబసభ్యులు మీడియాకు వెల్లడించారు. ‘నా సోదరుడు గుర్‌ప్రీత్ అమెరికా వెళ్లేందుకు మూడు నెలల కిందట ఇంటి నుంచి బయల్దేరారు. ఇందుకోసం చండీగఢ్‌లోని ఏజెంట్ బల్వీందర్‌సింగ్‌ను సంప్రదించాడు. అతడు రూ.16.5 లక్షలు తీసుకొని నా సోదరుడిని గయానా పంపించాడు. అక్కడ ఓ పాకిస్థానీ ఏజెంట్‌కు అప్పగించాడు. అనంతరం మరికొందరు వలసదారులతో కలిసి పనామా అడవి గుండా కొలంబియాకు బయల్దేరాడు. మధ్యలో ఓసారి మాకు ఫోన్ చేసి గ్వాటమాలాలోని హోటల్‌లో ఉన్నట్లు చెప్పారు. ఆ తర్వాత ఇటీవల ఓ వ్యక్తి మాకు ఫోన్ చేసి గుర్‌ప్రీత్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెప్పాడు. కారులో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నాడని తెలిపాడు. ఆ తర్వాత ఐదారు నిమిషాలకే నా సోదరుడు చనిపోయినట్లు సమాచార మిచ్చారు‘ అని గుర్‌ప్రీత్ సోదరుడు తారాసింగ్ మీడియాకు వివరిస్తూ కన్నీరుమున్నీరయ్యారు. తన సోదరుడి మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు సాయం చేయాలని ఈసందర్భంగా ప్రభుత్వాన్ని వేడుకున్నారు. మృతుడి కుటుంబాన్ని పంజాబ్ రాష్ట్ర మంత్రి కుల్దీప్‌సింగ్ దలివాల్ పరామర్శిం చారు. ‘గుర్‌ప్రీత్ మరణం విచారకరం. ఎవరైనా సరే ఏ దేశానికైనా అక్రమమార్గంలో వెళ్లొద్దు. చట్టపరంగా అన్ని అనుమతులు తీసుకొని వెళ్లండి. డంకీ రూట్‌లో వెళ్లడం సరికాదని మంత్రి సూచించారు.

# ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణ

**సమయం కోరిన అసెంబ్లీ సెక్రటరీ లాయర్**

**మరోమారు 18కి వాయిదా వేసిన సుప్రీం**



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి10:** భారాస ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ మరోమారు వాయిదా పడింది. ఏడుగురు ఎమ్మెల్యేలపై దాఖలు చేసిన అనర్హత పిటిషన్‌పై నిర్ణయం తీసుకోవడంలో తెలంగాణ స్పీకర్ జాప్యం చేస్తున్నారంటూ భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. కేటీఆర్ తన పిటిషన్‌లో తెలంగాణ స్పీకర్, ఎమ్మెల్యేలు పి.శ్రీనివాస్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, టి.ప్రకాశ్‌గౌడ్, అరెకపూడి గాంధీ, గూడెం మహిపాల్‌రెడ్డి, ఎం.సంజయ్‌కుమార్‌లను ప్రతివాదులుగా చేర్చారు. జస్టిస్ గవాయ్ ధర్మాసనం ఇవాళ ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. అసెంబ్లీ కార్యదర్శి తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. స్పీకర్ నుంచి సమాచారం కోసం మరింత సమయం కావాలని రోహత్గీ కోర్టును కోరారు. స్పీకర్‌తో చర్చించి వివరాలు అందిస్తామని తెలిపారు. ఇప్పటికే 10 నెలలు పూర్తయిందని.. ఇంకెంత గడువు కావాలని ధర్మాసనం ప్రశ్నించింది. ముకుల్ రోహత్గీ విజ్ఞప్తితో పిటిషన్‌పై తదుపరి విచారణను ఫిబ్రవరి 18కి వాయిదా వేసింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ ఈ పిటిషన్ పెట్టారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ వినోద్ చంద్రన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. పార్లమెంటరీ పక్రియను ఫ్రస్టేషన్‌కు గురి చేయొద్దని, ప్రజాస్వామ్యంలో పార్టీలకు హక్కులు ఉంటాయని తెలిపింది. ఎమ్మెల్యేలు పార్టీలు మారి 10 నెలలు అయింది.. ఇది రీజనబుల్ టైం కాదా అంటూ సుప్రీం కోర్ట్ ప్రశ్నించగా..మాకు వాదనలు వినిపించేందుకు రెండు మూడు రోజుల సమయం కావాలని రోహిత్గి కోరారు. మరోవైపు సుప్రీంకోర్టు ఇచ్చిన గత తీర్పుల ప్రకారం రీజనబుల్ టైమ్ అంటే మూడు నెలలు మాత్రమేనని బిఆర్ఎస్ వాదిస్తుంది. రీజనబుల్ టైమ్ అంటే ఎంత సమయం కావాలో చెప్పండని కోర్టు లేవనెత్తింది. అనంతరం ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు, ఈ పిటిషన్‌పై విచారణను ఫిబ్రవరి 18కి వాయిదా వేసింది. పార్టీ మార్పులు ప్రజాస్వామ్య విలువలకు భంగం కలిగించేలా ఉంటాయని కేటీఆర్ ఆరోపించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల చర్యలతో ప్రజల నమ్మకాన్ని ద్రోహం చేసినట్లు కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ఈ కేసు తదుపరి విచారణకు వేచి చూడాల్సి ఉంది. బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌కు వెళ్లిన పది మంది ఎమ్మెల్యేలపైన అనర్హత వేటు వేయాలని గులాబీ పార్టీ వరుస పిటిషన్లు దాఖలు చేసింది. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డితో పాటు వివేకానంద గౌడ దాఖలు చేసిన రెండు పిటిషన్లతో పాటు ఇటీవల తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా ఒక పిటిషన్ దాఖలు చేశారు. గతంలో పాడి కౌశిక్ రెడ్డి, వివేకా కలిసి పార్టీ ఫిరాయించిన ముగ్గురు ఎమ్మెల్యేలపై పిటిషన్ వేయగా.. మరో ఏడుగురి పేర్లను జత చేసి కేటీఆర్ మరో పిటిషన్ దాఖలు చేశారు. ఆ రెండు పిటిషన్లను జత చేసి ఈరోజు సుప్రీం ధర్మాసనం విచారణ జరిపింది. ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించి దాదాపు 10 నెలలు అవుతున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదని... వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా తెలంగాణ స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోర్టు ముందు వాదనలు వినిపించారు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101